క్లుప్తంగా

సొనాలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని రామాలయం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉత్సవమూర్తులను ప్రధాన వీధులగుండా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు పట్టి, భక్తి పాటలు పాడుతూ ఉత్సవమూర్తులకు ఘన స్వాగతం పలికారు. పండితులు ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛరణలు, హారతులు నిర్వహించగా.. భక్తులు కుటుంబ శ్రేయస్సు, గ్రామ క్షేమం కోసం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామం భక్తి నినాదాలతో మార్మోగింది.

పండిత్ దీన్‌దయాళ్ జయంతి

ఉట్నూర్‌రూరల్: బీజేపీ ఉట్నూర్ మండలశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బింగి వెంకటేశ్, కార్యదర్శి కొండే రమేశ్, భానోత్ జగన్, సిపతి లింగాగౌడ్, నాగభూషణం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ యువకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెంట వెంకట రమణ, అల్లం అభిలాష్, నడికుంటి రాకేశ్, రామెల్లి ఆశన్న, రామగిరి రాకేశ్, నడికుంటి వెంకట రమణ, రామిల్లి గంగాధర్ బీఆర్ఎస్‌లో చేరారు.

ఘనంగా కుంకుమార్చన

బోథ్: మండల కేంద్రంలోని నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నాల్గో రోజు దేవి కూష్మండా రూపంలో దర్శనమిచ్చింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజల్లో చేశారు. మహిళలు ఘనండా కుంకుమార్చన నిర్వహించారు. పండితులు సదానంద శర్మ ఆధ్వర్యంలో హారతులు, అర్చనలు నిర్వహించారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

ఇంద్రవెల్లి: మండలంలోని శంకర్‌గూడ గ్రామానికి చెందిన మానే నిఖిత రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో గురువారం రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. రైతు కుటుంబానికి చెందిన నిఖిత అత్యుత్తమ ప్రతిభ కనబర్చి వైద్య విద్య సీటును సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు జాదవ్ జమున నాయక్, మెస్రం మురళి, గోవింద్, సందీప్, లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయించిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బగూడ శివారులలో కల్తీ కల్లు విక్రయిస్తున్న నాగరాజు గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. నాగరాజు గౌడ్ కల్తీ కల్లు విక్రయిస్తున్నాడని పక్కా సమాచారం రావడంతో షాప్‌పై దాడి చేయడం చేసి, కల్తీ కల్లును స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కైలాస్‌నగర్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పనుల ప్రగతిపై ఐటీడీఏ పీవో, డీఈవో ఖుష్బూ గుప్తాతో కలిసి అధికారులతో సమీక్షించారు. టాయిలెట్స్, విద్యుత్, బోర్ వెల్స్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వెంటనే పూర్తి చేయించాలని సూచించారు. తాగునీరు, మేజర్, మైనర్ పనులు పూర్తి చేయడంతోపాటు పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. డీఆర్డీవో రాథోడ్ రవీందర్, సీపీవో వెంకటరమణ, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో రిటైర్డ్ టీచర్‌ను అరెస్టు చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. కొలాం ఆశ్రమ పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయుడు సజ్జనపు లక్ష్మీనారాయణ పట్టణానికి చెందిన దాసరి ఆశన్న కుమారుడు శ్రీకాంత్‌కు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఆయన వద్ద రూ. 1.50 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు తీసుకున్న అనంతరం ఈ సొల్యూషన్ సంస్థ నుంచి నకిలీ కాల్ లెటర్ అందించాడని బాధితుడు పేర్కొన్నారు. ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు సీఐ తెలిపారు.

తీరనున్న కాలనీవాసుల కష్టాలు

- హరిఓంనగర్ వంతెనకు నిధులు కేటాయింపు
- రూ.12.50 లక్షలతో తాత్కాలిక బ్రిడ్జి
- టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు


ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన వంతెన

కైలాస్‌నగర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆదిలాబాద్ పట్టణంలోని హరిఓంనగర్‌లో గల వంతెన పూర్తిగా ధ్వంసమైంది. కల్వర్టు తెగిపోయి కొట్టుకుపోగా, పూర్తిగా చెడిపోయింది. దీంతో గత నెలరోజులుగా కాలనీవాసులకు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ నుంచి బయటకు వెళ్లాలంటే కాలినడకనే శరణ్యమైంది. ఇదిలా ఉండగా వర్షాలు కురిసినప్పుడు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ ప్రత్యేక చొరవ..
హరిఓంనగర్ కాలనీ ప్రజల దుస్థితిని గమనించిన కలెక్టర్ రాజర్షిషా సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతో రూ.12.50 లక్షల నిధులను తన కృషియల్ బ్యాలెన్స్ ఫండ్ నుంచి విడుదల చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి తాత్కాలిక వంతెనను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీంతో బల్దియా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. తాత్కాలిక వంతెన నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో టెండర్లను ఆహ్వానించారు. ఈ టెండర్లు ఖరారైన వెంటనే వంతెన పనులు చేపడతామని మున్సిపల్ ఇంజనీర్ పేరి రాజు తెలిపారు.

తాత్కాలికంగా..
కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడకుండా ఉండేలా తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేయనున్నారు. పైపులను ఏర్పాటు చేసి దాని పైనుంచి తాత్కాలికంగా రోడ్డును నిర్మించనున్నారు. వరద ప్రవాహం వస్తే పైపులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ పనులు మరో పక్షం రోజుల్లో ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఆ కాలనీవాసుల కష్టాలు తీరనున్నాయి. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చూడాలని వేడుకుంటున్నారు.

ఈ ఏడాది స్లాట్‌బుకింగ్ విధానం వద్దు


మాట్లాడుతున్న మనోజ్, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలంటే రైతులు స్లాట్ బుకింగ్ ముందుగా చేసుకోవాల్సిందే నిబంధనను వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మాట్లాడారు. ముందుగా రైతులకు ఆన్‌లైన్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఒకవేళ స్లాట్ బుకింగ్ చేసుకున్న సమయానికి పత్తి నింపే బండి దొరకకపోతే ఇబ్బంది పడాల్సి ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ మూడుసార్లు రద్దు అయితే నాలుగో సారి అవకాశం ఉండదన్నారు. మారుముల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా ఉండదని, వచ్చే సీజన్ నుంచి అమలు చేయాలన్నారు. గతంలో మాదిగా యథావిధిగా పంట కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మల్యాల స్వామి, భీంరావ్ వాగ్మారే, దాదాసాహెబ్ జాబాడే, గజ్జల విలాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీపై సామాజిక తనిఖీ ప్రజావేదిక


పనుల వివరాలపై ఆరా తీస్తున్న అధికారి

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో భాగంగా 31 గ్రామ పంచాయతీల్లో పంచాయతీల వారీగా మొత్తంగా 2024 ఏప్రిల్ 1 నుంచి మార్చి 31, 2025 వరకు ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు. జిల్లా డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ కుటుంబరావు మాట్లాడుతూ.. 2024–2025వార్షిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద పని చేసిన కూలీలకు వేతనాలు రూ.5.45కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. పనుల్లో నిర్మాణ సామగ్రికి రూ.15.45లక్షలు చెల్లింపులు చేశారన్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పనుల కోసం ఖర్చు చేసిన రూ.3.50 కోట్లు నిధులపై సామాజిక తనిఖీ చేయడం జరిగిందన్నారు. పలు రికార్డులు నమోదు చేయని సిబ్బందికి షోకాజ్ నోటీసు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి రాజేశ్వర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం


ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జైనథ్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ గర్భగుడి గత కొన్ని రోజుల నుంచి ఉరుస్తోంది. విషయం తెలుసుకున్న పురావస్తు శాఖ అధికారులు గురువారం ఆలయాన్ని సందర్శించారు. పురావస్తు శాఖ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. శిఖరంపై పిచ్చిమొక్కలు పెరగడంతో మొక్కల వేరు వ్యవస్థ లోపలికి వెళ్లి వర్షం నీరు గర్భగుడిలోకి వస్తుందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు ఆయన వెంట పురావస్తు శాఖ ఏఈ జేమ్స్, ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ రూకేష్ రెడ్డి, అశోక్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కైలాస్ టెకిడి ఆలయం సందర్శన

బోథ్: విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ చవాన్ గురువారం బోథ్ మండలంలోని కై లాష్ టెకిడి నర్మదేశ్వర ఆలయాన్ని సందర్శించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో బాబేరతండా గ్రామంలో స్థానికులతో విద్యుత్ సరఫరా అంశంపై చర్చించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామపెద్దలు ఆత్మారాం నాయక్, నందు, జైతురాం, బాబులాల్, రూపచంద్, లైన్‌మెన్ గోపి చవాన్‌ను ఘనంగా సన్మానించారు.

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో బాధ్యతలు స్వీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవోగా రవీందర్ రాథోడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు జెడ్పీ అధికారులు, ఉద్యోగులు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సీఈవో జితేందర్ రెడ్డి నుంచి తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన్ను ఉద్యోగులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.సుధాకర్, ఉద్యోగులు వీరేందర్, శశిధర్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం
తాంసి: ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన రవీందర్ రాథోడ్‌ను తాంసి మాజీ జెడ్పీటీసీ రాజు సన్మానించారు. గురువారం కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మండల అభివృద్ధికి కృషి


ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న గోక గణేశ్‌రెడ్డి

తలమడుగు: మండల ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉమ్రీ గ్రామంలో గ్రామస్తులకు రూ. 5 లక్షల రూపాయల ప్రొసీడింగ్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. పల్సి(బి)తండా గ్రామంలో గ్రామస్తులకు లక్ష రూపాయల ప్రొసీడింగ్ కాపీని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలు నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజల సమస్యల పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. అనంతరం రుయ్యాడి గ్రామంలో నీటి ట్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకన్న యాదవ్, బాబన్న, ప్రవీణ్ రెడ్డి, గంగారెడ్డి, వెంకటేశ్, సాంబశివ, దివాకర్, సాయికిరణ్, రమణ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో అధికారులు


బతుకమ్మలకు పూజలు చేస్తున్న రిమ్స్ డైరెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారిక బతుకమ్మ సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలకు జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్ర హాజరయ్యారు. మహిళ ఉద్యోగులు, సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. వాటికి అధికారులు ప్రత్యేక పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ సందడి చేశారు. అందంగా బతుకమ్మలను అలంకరించిన పలువురు మహిళ ఉద్యోగులు, సిబ్బందికి జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మెప్మా డీఎంసీ శ్రీనివాస్, ఆదిలాబాద్ అర్బన్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో బతుకమ్మ సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ హాజరై బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. డైరెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయన్నారు. మహిళ ఉద్యోగులు, సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో రిమ్స్ హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, ఉద్యోగులు రమాదేవి, ఉమాదేవి, యాకమ్మ, సుధామణి, సుశీల, అరుణకుమారి, సుజాత, దేవిక పాల్గొన్నారు.

వర్షంలో ప్రయాణికుల అవస్థలు


వర్షంలో తడుస్తూ.. బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఇచ్చోడ: మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రజలు గురువారం తీవ్ర ఇబ్బంది పడ్డారు. బస్టాండ్ ఉన్న నిరుపయోగంగా మారడంతో రెండు నెలల నుంచి బస్సులను బస్టాండ్ ముందు రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షం కారణంగా నిర్మల్, ఆదిలాబాద్ పట్టణలకు వెళ్లే ప్రయాణికులు వర్షంలో తడుస్తూ బస్సు ఎక్కారు.

నేడు పోషకులతో సమావేశం

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థుల పోషకులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శభాన తరన్నుమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఉట్నూర్‌రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని దంతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గిరిజన గర్భిణులను ముందస్తుగా గుర్తించి ఆసుపత్రిలో చేర్చుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని మందులను పరిశీలించారు. కాలం చెల్లిన మందులను స్టోర్ రూంలో ఉంచొద్దన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ..
మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఉన్నత విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండల కేంద్రంలోని కుమురం భీం ప్రాంగణంలో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవనాన్ని పరిశీలించారు. ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఐటీఐ ప్రిన్సిపాల్ రోడ్డ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ నూతన భవన నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అహర్నిశలు కృషి చేస్తున్నారని నాయకులు అన్నారు. ప్రజాసంక్షేమం ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు. అన్నివర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఐటీడీఏ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నిసార్, మహేందర్, దూట రాజేశ్వర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి 108 రకాల నైవేద్యం


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి భక్తులు 108 రకాల నైవేద్యం సమర్పించారు. నవశక్తి దుర్గాసేవ సమితి ఆధ్వర్యంలో ప్రసాద సమర్పణ, గాజుల కార్యక్రమం నిర్వహించారు. అలాగే మహిళ భక్తులు 30 తులాల వెండీ కిరీటాన్ని అమ్మవారికి బహుకరించి అలంకరించారు.

శ్రీలక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న సీఐ
జైనథ్: మండల కేంద్రంలో గురువారం జైనథ్ సీఐ శ్రవణ్ కుమార్ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

జైనథ్ సీఐగా శ్రావణ్‌కుమార్


ఎస్పీకి పూల మొక్క అందజేస్తున్న సీఐ

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రావణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన సాయినాథ్‌ను నిజామాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేయగా.. ఆయన స్థానంలో హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న శ్రావణ్ కుమార్‌ను జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కల అందజేశారు. సర్కిల్ పూర్తిగా మహారాష్ట్ర సరిహద్దున ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా చర్యలను చేపట్టాలని ఎస్పీ సూచించారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ గ్రామపంచాయతీ పరిధిలో కుక్కలు, పందుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ అన్నారు. గురువారం ఉట్నూర్ గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ.. వృద్ధులు, చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయన్నారు. గతంలోనూ చాలామందిపై దాడి చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ముజీబ్, బాబా శ్యామ్ టైగర్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

గోండుగూడలో వైద్యశిబిరం

నేరడిగొండ: మండలంలోని లింగట్ల గోండుగూడ గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పర్యవేక్షకుడు సంతోష్ మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనారోగ్యానికి గురైతే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం మోతిలాల్, ఆరోగ్య సహాయకుడు నర్సయ్య, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్త గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్టీయూ) ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో గురువారం నిర్వహించిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి జుట్టు గజేందర్, ఎన్నికల పరిశీలకులు ఎస్.పరమేశ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా మూగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా బత్తూరి సంతోష్, రాష్ట్ర కౌన్సిలర్లుగా బెజ్జంకి రవీంద్ర, జాదవ్ అశోక్ కుమార్, పుప్పాల నరేందర్ , జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా సంబెట చంద్రశేఖర్, బి.మనోహర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా యం.భూమేష్, జాదవ్ ఆనంద్ రావ్, ప్రభాకర్, రాథోడ్ దేవిదాస్, స్వర్ణలత, అధనపు ప్రధాన కార్యదర్శులుగా సత్యనారాయణ, బానోత్ ఆత్మారాం, కార్యదర్శులుగా నటేష్, షేక్ మునీర్, బాలకృష్ణ, దూదగిరిలను ఎన్నుకున్నట్లుగా తెలిపారు.

ఘనంగా ఫార్మసిస్ట్ దినోత్సవం


పాల్గొన్న ఫార్మసిస్టులు

బోథ్: హైదరాబాద్‌లోని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం కార్యక్రమంలో బోథ్, సొనాల మండలాలకు చెందిన ఫార్మాసిస్టులు పాల్గొన్నారు. వైద్యుడు మందులు రాసి రోగిని నయం చేస్తే, ఫార్మసిస్ట్ మందులను సిద్ధం చేసి వాటికి జీవం పోస్తారని తెలిపారు. అలాంటి ఫార్మసిస్టుల పాత్రను సమాజం గుర్తించి, గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి ఆడే నరేందర్, మనోహర్, కపిల్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.